తెలుగు కళాసమితి న్యూజెర్సీ
రాజాలక్ష్మి ఫౌండేషన్ వారి కథల పోటీలో
బహుమతి పొందిన కథ

# వలస. —సీతాసత్య

అది చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌వారి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్. విశాలమైన ఆ హాల్లో అడిషనల్ చీఫ్ కన్సర్వేటర్ కేడర్ నుంచి అసిస్టెంట్ కన్సర్వేటర్ కేడర్ వరకూ సుమారు పధ్నాలుగు మంది అధికారులు వున్నారు. వారందరివద్దా, తమ క్రింది ఉద్యోగులు సమర్పించిన వివరణలూ, వాటిని కూలంకషంగా అవగాహన చేసుకుని ఆయా అధికారులు తయారు చేసిన విశదమైన నివేదికలూ వున్నాయి.

ఇటీవలే కొత్తగా చీఫ్ కన్సర్వేటర్ పదవికి ప్రమోట్ అయిన పరశురాంకు ఇతరుల అభిప్రాయాలను గౌరవించే సుగుణముందని కొందరంటారు. అది సుగుణం కాదనీ, అసలతడి బుర్రలో దేని గురించీ ఎటువంటి అభిప్రాయాలూ వుండవనీ, అందువల్లనే అతడెక్కువగా ఇతరుల అభిప్రాయాలకు విలువిచ్చినట్టుగా చాలా మంది అపోహపడతారనీ చాలా మంది అనుకుంటూంటారు చాటుగా.

అత్యవసరంగా ఏర్పాటు చేయబడిన ఆ సమావేశానికెంతో ప్రాముఖ్యం వుంది. మూడు నెలల క్రితం వెలుగులోకి వచ్చిన ఆ సమస్య పెరిగి పెద్దదై తక్షణం చర్య తీసుకుంటే తప్ప వీలుకాని అత్యంత ముఖ్యమైన సమస్యల సరసన చేరిందిటీవలే. సరిగ్గా ఎనిమిది గంటలకు పరశురాం ఆ హాలులోకి వచ్చాడు. అధికారులంతా గౌరవ సూచకంగా లేచి నిలబడి మళ్ళీ కూర్చున్నారు.

తన ముందున్న ఫైల్ తెరిచి గొంతు సవరించుకున్నాడు పరశురాం. "మూడు నెలల క్రితం భద్రగిరి అడవులనానుకుని ఉత్తరాన వున్న పంట భూముల్లోని పంటను, ఏనుగుల మంద తొక్కిపాడు చేసినట్టుగా ఆ పరిధి రేంజ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు అందింది. గతంలో ఎప్పుడూ ఈవిధంగా జరిగిన దాఖలాలు లేకపోవడంతో ఏనుగులు దారి తప్పో, మతి భ్రమించో అడవుల్ని దాటి బయటకు వచ్చి వుంటాయని భావించి వాటిని చెదర గొట్టడానికి అక్కడక్కడా కీలకమైన ప్రదేశాల్లో పెద్ద పెద్ద మంటలు పెట్టి వాటినదుపు చేయడం జరిగింది.

పది హేను రోజుల తర్వాత అడవికి దక్షిణాన వున్నపండ్ల తోటల్లోకి మొదటి సారికన్నా ఎక్కువ సంఖ్యలో ఏనుగులు ప్రవేశించి ఆ తోటల్ని ధ్వంసం చేయడంతో ఆగ్రహోదగ్రులైన ఆ తోటల యజమానులు తమ ప్రాంతపు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దాంతో అసెంబ్లీ వేడెక్కి ఆ సెగలు మన శాఖకు తగలడంతో సమస్య తీవ్రతను గుర్తించి తక్షణ చర్యగా అత్యవసర సమావేశం ఏర్పరచి మీ అందరి సలహాలను తీసుకోవడం జరిగింది.

తత్ఫలితంగా భద్రగిరి అడవుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఫెన్సింగ్ తీగల్లో విద్యుత్తు ప్రసరించేలా ఏర్పాటు చేయడం జరిగింది. కానీ తెలివైన ఏనుగులు బాగా ఎండిపోయిన చెట్ల దుంగలను తమ తొండాలతో మట్టి ఫెన్సింగ్ తీగలను తెగ్గొట్టి ఇష్టం వచ్చినట్టు కంచెను నాశనం చేసి ఇప్పటికీ విధ్వంస కాండ కొనసాగిస్తూండడంతో గౌరవనీయులైన మన మంత్రిగారు మనందరి మీదా విరుచుకుపడి తక్షణం తగిన చర్య తీసుకోమని ఆదేశించారు.

ఎంత డబ్బు ఖర్చయినా ఫర్వాలేదనీ, కానీ ఖచ్చితమైన ప్రణాళికతో ముందుకు రావాలనీ మరీ మరీ నొక్కి చెప్పారు. కనుక మీలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఆలోచించి ఉపయోగకరమైన సలహాలతో ముందుకు రావాలి" అని. తన పని అయిపోయినట్టుగా టేబిల్ మీది మంచి నీళ్ళ గ్లాసును క్షణంలో ఖాళీ చేసి కర్చీఫ్‌తో సుతారంగా పెదవులు అద్దుకున్నాడు పరశురాం.

ఒకొక్కరూ లేచి చెప్పసాగారు.

ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఆ సమావేశం రాత్రి ఎనిమిది దాటినా ఇంకా కొనసాగుతూనే వుంది.

xxx

సుమారు వందెకరాల మేర విస్తరించి వున్న ఆ సరస్సు చుట్టూ ఒకప్పుడు దట్టమైన వృక్షాలుండేవి. చెట్ల బోదెలను తాకుతూ ఎప్పుడూ నీటితో నిండి వుండే సరస్సులో అక్కడక్కడా ఏదెనిమిది చోట్ల పల్లంగా వున్న ప్రాంతాల్లో మాత్రమే నీరుంది ప్రస్తుతం. కొలను చుట్టూ వున్న చెట్లు ఎప్పుడో అంతరించిపోయాయి.

భద్రగిరి అడవుల్లో వున్న సమస్త జంతు జాలానికి ఎంతో ఉపయోగకరంగా వుండిన ఆ సరస్సు ప్రస్తుతం ఏనుగులకు సమావేశ స్థలంగా మారింది. వందల కొద్దీ చిన్నా, పెద్దా ఏనుగులక్కడ సమావేశమయ్యాయి. ఓ వృద్ధ గజరాజం తన ముందు బారులు తీరి నిలబడి వున్న ఏనుగుల్ని చూసి ఓసారి గట్టిగా ఘీంకరించిచెప్పడం ప్రారంభించింది. "గత మూడు నెలలుగా మన పరిస్థితి దుర్భరమై పోయింది. మనం పుట్టి పెరిగిన ఈ అడవిలో ఏనాడూ లేని కాటకం తాండవిస్తోంది.

మా చిన్నప్పుడు ఎంతో హాయిగా అడవంతా స్వేచ్ఛగా తిరుగుతూ, కడుపు నిండిన తర్వాత ఇదే కొలనులో వళ్ళు అలిసేటంత వరకూ జలకాలాడే వాళ్ళం. ఇప్పుడు మనకు తినడానికి చెట్ల ఆకులు కాదుకదా, ఒక్క గడ్డి దుబ్బు కూడా లేదు. జలకాలాడ్డం మా తరంతోనే అంతరించి పోయింది. నిన్నా మొన్నా పుట్టిన గున్నలు ఈ సరస్సులోని బురద నీటినే త్రాగుతూ దాన్నే అమృతంగా భావించి కాలం వెళ్ళమార్చవలసిన దౌర్భాగ్యస్థితి దాపురించింది.

క్షుద్బాధ తట్టుకోలేక మూణ్ణెల్ల క్రితం ఉత్తరాన వున్న పంట భూముల మీదికెళితే మనను చెదర గొట్టడానికి మంటలు పెట్టారు. తరువాత అడవి చుట్టూ కంచె వేసి తీగల్లో భూతాల్ని ప్రవేశ పెట్టారు. ఆ విషయం మొదట్లో తెలియక కంచెను దాటి వెళ్ళబోయిన మన వాళ్ళు అయిదుగురు స్వల్పంగా గాయపడ్డారు. కానీ తర్వాత మన తెలివితేటల్ని ఉపయోగించి ఎండు దుంగలతో కంచెను విరగ్గొట్టి యధేచ్ఛగా పళ్ళ తోటల్లోకి ప్రవేశించి తాత్కాలికంగా మన ఆకలిని తీర్చుకుంటున్నాం.

కానీ ఇలా ఎంత కాలం అనేదే మన ముందున్న ప్రశ్న. వాళ్ళు ఈసారి మరో తెలివైన ఎత్తు తప్పకుండా వేస్తారు. ప్రతిసారీ మన తెలివి తేటలు పని చేయక పోవచ్చు..."

వృద్ధ గజరాజం ఉపన్యాసం ఇంకా పూర్తి కాకుండానే ఓ గున్న ఏనుగు రొప్పుతూ అక్కడికి ప్రవేశించి అంది. "అడవి చుట్టూ ముప్పై అడుగుల లోతూ, అరవై అడుగుల వెడల్పున అన్ని వైపులా పెద్ద అగడ్త త్రవ్వడం ప్రారంభించారు. ఇహ మన పని అయిపోయినట్టే!"

ఏనుగులన్నీ ఆగ్రహావేశాలతో దిక్కులు పిక్కటిల్లేలా గట్టిగా ఘీంకరిస్తూ

నాలుగు వైపులకూ దౌడు తీశాయి.


xxxx

భద్రగిరిని ఆనుకుని వున్న భద్రపురంలో ఆ రోజొక బహిరంగ సభ జరుగుతోంది. స్థానిక రాజకీయ నాయకుడు స్వరాజ్యరావు ఎంతో ఆవేశంగా ఉపన్యసిస్తున్నాడు. "ఇటీవలే ఈ ప్రాంతాన్ని కుదిపివేసిన ఏనుగుల సమస్యను ఎంతో తెలివిగా లెక్కకు మించి ప్రజా ధనాన్ని ఖర్చు పెట్టి అడవి చుట్టూ లోతైన అగడ్త తవ్వించడం ద్వారా పరిష్కరించాం. రోజూ అసంఖ్యాక మైన ఏనుగులు ఆ అగడ్తను దాటే ప్రయత్నంలో చనిపోతున్న విషయం మీకూ తెలుసు.

ఈ విధంగా భద్రగిరి అడవుల్లోని పొగరుబోతు ఏనుగులన్నీ చనిపోయాక మిక్కిలి వినయ గుణంగల ఏనుగుల్ని విదేశాల్నించి దిగుమతి చేసుకుని వాటి కోసం ప్రజలకిబ్బంది లేకుండా ప్రత్యేకంగా ఎంపిక చేసిన ప్రదేశంలో అడవుల్ని పెంచడానికష్టడే ఓ బృహత్తరమైన ప్రణాళిక సిద్ధమైందని కూడా మీకు తెలియ చేస్తున్నాను. ప్రజల సంక్షేమం కోసం ఎంత డబ్బు ఖర్చు పెట్టేందుకైనా మేం వెనుకాడమని మీకు సవినయంగా మనవి చేస్తున్నాను.

ఈ విషయమలా వుంచితే మనందరం ఆలోచించాల్సిన 'మేధోవలస' అనే మరో ముఖ్యమైన సమస్యవుంది. ఈ దేశంలో పుట్టి పెరిగిన ఎందరో మేధావులు విదేశాలకు వలస వెళ్ళిపోవడం వలన మన దేశానికెంతో తీరని నష్టం కలుగుతోంది. ఒక్కో విద్యార్థి మీదా ఎన్నో లక్షలు ఖర్చు పెదుతున్నాం. ఇక్కడ తమ చదువుకు తగిన ఉద్యోగాలు లేవనో, పరిశోధనకు కావల్సిన సౌకర్యాలు లేవనో, మరో సాకుతోనో అంతా విదేశాలకెగబడుతున్నారు. ఇలా ఎంత కాలం? అందుకే మిమ్మల్నిందర్నీ అభ్యర్థిస్తున్నాను. మీ బంధువులకూ, పిల్లలకూ ఉత్తరాలు రాయండీ రోజే. అందరికీ అన్ని సదుపాయాలూ కలగ చేస్తాం. ఆలోచించండి. మన దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనేవుంది.."

పొరపాటున ఆ సభకొచ్చి అంతవరకూ ఎంతోఓపిగ్గా విన్న ఓ మేధావి ఇహ వుండబట్టలేక కడుపు మండిపోయి అరిచాడు."ఉపన్యాసం చాలించి ముందు విదేశాల్లో వున్న నీ కూతుళ్ళకూ, కొడుకులకూ అర్జెంట్‌గా కేబుల్స్ కొట్టు"



ఆ సమయంలో ఆ మేధావి కడుపున మండింప చేసిన మెదడులోని భావాలను విశ్లేషిస్తే సరిగ్గా ఇలా వుంటుంది. "అడవుల్లో గడ్డిలేక జంతువులు ఊళ్ళ మీద పడుతోంటే కోట్లకు కోట్లు ఖర్చు పెట్టి వాటిని అడవుల్లోనే అంతరింప చేసే ఉపాయాలు వెదకడమే తప్ప వాటిలో పదో వంతు ఖర్చు పెట్టి జంతువులకు కావలసిన మేత సమకూరేలా అడవులు పెంచి సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలనే ఆలోచన లేని మీరు మన భద్రగిరి అడవుల్లోని ఏనుగుల్లా చచ్చిపోకుండా పొట్ట చేత్తో పట్టుకుని విదేశాలకు వెళ్ళిన మేధావుల కేదో చేస్తారంటే నమ్మేందుకిక్కడెవరూ సిద్ధంగా లేరు."

◇